# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగు దినపత్రిక | సంపుటి :02 | సంచిక : 148 | సోమవారం 12 మే 2025 | పేజీలు: 08 | వెల రూ.5

PUBLISHED FROM : KARIMNAGAR : CIRCULATED TO : ADILABAD, WARANGAL, NIZAMABAD, WARANGAL,HYDERABAD,KHAMAM, NALGONDA, MAHBUBNAGAR,MEDAK, RANGAREDDY



## రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి
శెనార్తి మీడియా
ఆహ్వానం పలుకుతుంది
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

97051 46268 77805 51339
98491 98098






# పీఓకే, ఉగ్రవాదుల అప్పగింతపై మాత్రమే చర్చలు

* పాకిస్తాన్‌కు భారత్ బిగ్ మెసేజ్
* ఇదే విషయాన్ని అమెరికాకు స్పష్టం చేసిన ప్రధాని మోడీ

**ఢిల్లీ:**

పాకిస్తాన్ చర్చల్లో పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే) తిరిగి పొందడం, ఉగ్రవాదుల అప్పగించపై మాత్రమే ఉంటుందని భారత్ అమెరికాకు స్పష్టం చేసింది. "కాశ్మీర్ విషయంలో మాకు చాలా స్పష్టమైన వైఖరి ఉంది, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె) తిరిగి రావడం అనే ఒకే ఒక విషయం మిగిలి ఉంది. ఇంకేమీ మాట్లాడటానికి లేదు. ఉగ్రవాదులను అప్పగించడం గురించి వారు మాట్లాడితే, మనం మాట్లాడుకోవచ్చు. మాకు వేరే ఏ అంశం ఉద్దేశం లేదు.భారత్ పాక్ మధ్య మధ్యవర్తిత్వం వహించాలని మేము కోరుకోవడం లేదు." అనే విషయాన్ని ప్రధాని మోడీ, అమెరికాకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులను పాక్ ప్రేరేపిత లష్కరేతోయిబా ఉగ్రవాదులు హతమార్చారు. దీనికి ప్రతీకారంగా భారత్ "ఆపరేషన్ సిందూర్" చేపట్టింది. పీఓకే, పాకిస్తాన్ లోని జైషేమహ్మద్,

మిగతా 2వ పేజీలో..



# బ్రహ్మోస్ తయారీ యూనిట్ ప్రారంభం

* వర్చువల్‌గా ప్రారంభించిన రాజ్‌నాథ్ సింగ్
* ఏటా 80 నుంచి 100 బ్రహ్మోస్ క్షిపణులు తయారు
* రష్యాతో జాయింట్ వెంచర్

**ఉత్తరప్రదేశ్:**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం లక్నోలో కొత్త బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి ఉత్పత్తి యూనిట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన ఈ యూనిట్ భారతదేశ స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలువనుంది. ఈ సందర్భంగా రాజ్ నాథ్ మాట్లాడుతూ.. నేను లక్నో ఎందుకు రాలేకపోయానో మీ అందరికి తెలుసు.. ఇదే రోజున శాస్త్రవేత్తలు పోఖ్రాన్‌లో అణుపరీక్షలు చేశారు.. 40 నెలల్లోనే ఈ ప్రొడక్షన్ యూనిట్‌ను పూర్తిచేశారు.. ఇంత తక్కువ సమయంలో ఈ యూనిట్ సిద్ధం చేసిన వారికి అభినందనలు తెలిపారు. రూ. 300 కోట్ల వ్యయంతో నిర్మించబడిన ఈ ఉత్పత్తి యూనిట్ ఏటా 80 నుంచి 100 బ్రహ్మోస్ క్షిపణులను తయారు చేయడానికి రూపొందించారు. భారతదేశ రక్షణ పరిశోధన అండ్ అభివృద్ధి సంస్థ, రష్యా ఎన్‌పీవో మషినోస్ట్రోయేనియా మధ్య జాయింట్ వెంచర్ అయిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ ద్వారా అభివృద్ధి చేయబడిన ఈ బ్రహ్మోస్ క్షిపణి 290 నుంచి 400 కి.మీ. పరిధి కలిగిన, మాక్ 2.8 వేగంతో దూసుకెళ్తుంది.

# 100 మందికిపైగా ఉగ్రవాదుల్ని చంపేశాం

* చనిపోయిన వారిలో ఐసీ 814 హైజాక్ ఉగ్రవాదులు
* ఆపరేషన్ సిందూర్‌పై త్రివిధ దళాల అధికారులు



**ఢిల్లీ:**

ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా భారత త్రివిధ దళాలు మీడియా సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశంలో ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ డీజీఎంఓ పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదులు, వారి మద్దతుదారుల్ని టార్గెట్ చేస్తూ చేసినట్లు సైనికాధికారులు చెప్పారు. పహల్గామ్ దాడి తర్వాత బాధితుల కుటుంబాల ఆవేదనను దేశం మొత్తం చూసిందని వారు చెప్పారు. పాకిస్తాన్‌లోని మొత్తం 9 టెర్రర్ క్యాంపుల్లో కొన్ని పీఓజేకే, పాక్ పంజాబ్‌లో ఉన్నట్లు చెప్పారు. ప్రతీ లొకేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఇంటెలిజెన్స్ ద్వారా సేకరించి నేలమట్టం చేసినట్లు మిలిటరీ డీజీఎంఓ రాజీవ్ ఘాయ్ వెల్లడించారు. అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ వంటి వారికి శిక్షణ ఇచ్చిన మురిడ్కే వంటి స్థావరాలను టార్గెట్ చేసినట్లు సైనికాధికారులు చెప్పారు. ఐసీ 814 విమాన హైజాక్‌లో పాల్గొన్న ఉగ్రవాదులను చంపేసినట్లు వెల్లడించారు. వీరిలో కరగుట్టిన ఉగ్రవాదులు యూసఫ్ అజార్, అబ్దుల్ మాలిక్ రౌఫ్, ముదస్సిర్ అహ్మద్ వంటి వారిని హతం చేసినట్లు చెప్పారు. పుల్వామా టెర్రర్ అటాక్‌కి పాల్పడిన వారిని కూడా హతమార్చినట్లు తెలిపారు. బహవల్పూర్, మురిడ్కే వంటి క్రూరమైన ఉగ్రశిబిరాలను నాశనం చేసినట్లు ఎయిర్‌ఫోర్స్ డీజీఎంఓ ఎయిర్ మార్షల్ ఏకే భారతి చెప్పారు. ఎయిర్ టూ సర్ఫేస్ క్షిపణులను ఉపయోగించినట్లు వెల్లడించారు. ఖచ్చితమైన సమాచారం ఆధారంగా క్షిపణుల్ని ప్రయోగించి ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఉగ్రవాద శిబిరాల్లో ఉన్న 100కు పైగా టెర్రరిస్టుల్ని హతం చేసినట్లు వెల్లడించారు. పాకిస్తాన్ మిలిటరీ పౌరులు, మిలిటరీ స్థావరాలపై దాడులకు ప్రయత్నించినట్లు చెప్పారు. "మురిద్కేలో 4 టార్గెట్స్‌పై కచ్చితత్వంతో దాడి చేశాం డ్రోన్లు, ఎయిర్‌క్రాఫ్ట్‌ను భారత భూభాగంపై పాక్ ప్రయోగించింది.. 8,9 తేదీల్లో శ్రీనగర్ నుంచి నలియా వరకు డ్రోన్లతో దాడి చేశారు.. పాక్ డ్రోన్లు, యూఏవీల దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టాం.. ఉగ్రవాదులు, వారికి సంబంధించిన స్థలాలను మాత్రమే టార్గెట్ చేశాం" అని ఎయిర్ మార్షల్ ఏకే భారతి చెప్పారు.

# పాకిస్తాన్‌పై బ్రహ్మోస్‌తో భారత్ దాడి

* ఆపరేషన్ సిందూర్‌లో ఉపయోగించినట్లు వార్తలు
* బహవల్పూర్ జైషే మహ్మద్‌పై దీనితోనే దాడి
* బికనీర్ ప్రాంతంలో క్షిపణి బూస్టర్ లభ్యం



**ఢిల్లీ:**

పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత్ "ఆపరేషన్ సిందూర్" పేరుతో పాకిస్తాన్‌లోని పలు ఉగ్రవాద స్థావరాలపై భీకర దాడులు చేసింది. ఈ దాడిలో జైషే మహ్మద్, లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయాలతో పాటు వాటి ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. 100కు పైగా ఉగ్రవాదుల్ని హతమార్చింది. అయితే, ఈ దాడుల్లో భారత్ "బ్రహ్మోస్" సూపర్ సోనిక్ క్షిపణిని ఉపయోగించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్ బికనీర్ ప్రాంతంలో క్షిపణికి సంబంధించిన బూస్టర్, నోస్ క్యాప్ లభించాయి. దీనిని బట్టి చూస్తే "ఆపరేషన్ సిందూర్"లో భారత్ ఈ క్షిపణిని

మిగతా 2వ పేజీలో..

# నీటి హక్కులు ఆంధ్రాకు తాకట్టు

* సీతారామ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతులున్నా కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
* ఖమ్మం జిల్లాకు సాగునీటి వనరుగా రూపుదిద్దుకున్న భారీ ప్రాజెక్టు
* బీఆర్ఎస్ విజయాలను కాంగ్రెస్ తమ ఘనతగా చూపిస్తోంది
* మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం



**హైదరాబాద్ :**

తెలంగాణలో సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని కాంగ్రెస్ పార్టీ తక్కువ చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఆదివారం ఆయన మీడియా ద్వారా విడుదల చేసిన ప్రకటనలో కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చి, అదే అబద్ధాలతో తెలంగాణ ప్రజలను మోసం చేస్తోంది అంటూ హరీష్ రావు మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర జల వనరుల సంఘం, హైడ్రాలజీ అనుమతులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ అనుమతులేదంటూ ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు.2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్ట్ డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించిందని, అనంతరం 2021లో ఈ ప్రాజెక్టుకు అవసరమైన 113.795 టీఎంసీల నీటి లభ్యతను సీడబ్ల్యూసీ ఆమోదించిందని హరీష్ తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీటిని కూడా అందించాలన్నదే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సమైక్య పాలనలో

మిగతా 2వ పేజీలో..

# 15న ఐపీఎల్ పునఃప్రారంభం?

* వారం పాటు నిలిచిపోయిన మ్యాచ్‌లు
* ఐపీఎల్ 2025ను పునఃప్రారంభించేందుకు బీసీసీఐ ప్రయత్నాలు



**ఢిల్లీ:**

భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ 2025 మ్యాచ్‌లు వారం పాటు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. శనివారం కాల్పుల విరమణ అంగీకారంతో.. భారత్, పాక్ మధ్య యుద్ధం ముగిసింది. యుద్ధం ముగియడంతో ఐపీఎల్ 2025ను పునఃప్రారంభించేందుకు బీసీసీఐ ప్రయత్నాలు మొదలెట్టింది. భారత ప్రభుత్వం టోర్నీకి అనుమతిస్తే.. మే 15 లేదా 16న ఐపీఎల్ పునః ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మే 30న ఐపీఎల్ 2025 ఫైనల్ జరగనుందని తెలుస్తోంది. ఈరోజు రాత్రికి షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. మే 13 లోగా పంజాబ్ కింగ్స్ టీమ్ మినహా మిగతా 9 జట్ల ఆటగాళ్లు తమ హోం గ్రౌండ్‌లలో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఫ్రాంఛైజీలకు బీసీసీఐ చెప్పినట్లు తెలుస్తోంది. అన్ని టీమ్స్ తమ విదేశీ ఆటగాళ్ల ప్రయాణ ప్రణాళికలను తెలియజేయాలని కోరిందట. బీసీసీఐ ఆదేశాల మేరకు తమ విదేశీ ఆటగాళ్లను వెనక్కి రప్పించడానికి ఫ్రాంఛైజీలు ఏర్పాట్లు చేస్తున్నాయని సమాచారం. లీగ్ దశలో మిగిలిన 12 మ్యాచ్‌లను డబుల్ హెడర్‌లతో ముగించాలని బీసీసీఐ ప్లాన్ చేసిందని సమాచారం. పంజాబ్ కింగ్స్‌కు తటస్థ వేదికను ఇంకా ఖరారు చేయలేదని తెలుస్తోంది. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో మిగిలిన ఐపీఎల్ 2025 మ్యాచ్‌లను బీసీసీఐ నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2025లో ఇంకా 12 లీగ్ మ్యాచులు ఉన్నాయి. అలానే రెండు క్వాలిఫయర్లు, ఒక ఎలిమినేటర్, ఫైనల్ మ్యాచ్ ఉంది. ఐపీఎల్ షెడ్యూల్ ప్రకారం మే 25న కోల్‌కతాలో ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉంది. టోర్నీ నిలిచే సమయానికి పాయింట్ల పట్టికలో గుజరాత్ టైటాన్స్ (16), బెంగళూరు ఛాలెంజర్స్ బెంగళూరు(16), పంజాబ్ కింగ్స్ (15), ముంబై ఇండియన్స్ (14) టాప్ 4లో ఉన్నాయి.



రేపు పాలీసెట్ 2025 2



ఈఏపీసెట్ ఫలితాలు విడుదల 2



ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేయండి 2

# రేపు పాలీసెట్ 2025

* ఉ.11.00 గం. నుంచి మ.1.30 వరకు
* రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష
* అమలులో ఒక్క నిమిషం రూల్

**హైదరాబాద్:**

పాలిటెక్నిక్ ఎంట్రన్స్2025 (పాలీసెట్ 2025) పరీక్షను రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలోని 3 సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటుగా.. వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికై మే 13వ తేదీ (మంగళవారం) ఉ.11.00 గం. నుంచి మ. 1.30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాలీసెట్ 2025 కు రాష్ట్ర వ్యాప్తంగా 1,06,716 మంది అభ్యర్థులు 276 పరీక్ష కేంద్రాలలో హాజరవుతున్నారు. విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి ఒక గంట ముందుగానే అనుమతిస్తారు. కాబట్టి విద్యార్థులు ఉ.10.00 గంటలకే పరీక్ష హాలులోకి చేరుకొని ఓఎంఆర్ షీట్‌లోని రెండు వైపుల వివరాలను పూర్తి చేసి సంతకం చేయవలసి ఉంటుంది. విద్యార్థులు తమ వెంట హెచ్‌బీ బ్లాక్ పెన్సిల్, ఏరేసర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ తప్పక తీసుకొని రావలెను. పరీక్ష ప్రారంభం అయిన (ఉ 11.00 గం.) తరువాత ఒక్క నిమిషం ఆలస్యం అయినా అభ్యర్థిని పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరు. హాల్ టికెట్ మీద ఫొటో ప్రింట్ కానివారు ఒక పాస్ పోర్ట్ సైజు ఫొటో, ఐడీ ప్రూఫ్ (ఆధార్ కార్డు) తెచ్చుకోవలెను. అలాగే పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు కానీ అనుమతించరు.

ఇక ఇంజనీరింగ్ డిప్లొమా చేయాలనుకునే వారు గణితం 60 మార్కులు, భౌతిక శాస్త్రం 30 మార్కులు, రసాయన శాస్త్రం 30 మార్కులకు పరీక్ష రాయవలసి ఉంటుంది. వ్యవసాయం, ఉద్యానవన, వెటరినరీ డిప్లొమా చేయాలనుకునే వారు అదనంగా జీవశాస్త్రంలో మరో 30 మార్కులకు పరీక్ష రాయవలసి ఉంటుంది. ఇక పరీక్ష కేంద్రాన్ని గుర్తించడానికి విద్యార్థులు ఈ సూచనలను అనుసరించాలి. అందులో మొదటగా ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ల ద్వారా గూగుల్ ప్లే స్టోర్ నుంచి SBTET TG యాప్‌ను డౌన్లోడ్ అండ్ ఇన్‌స్టాల్ చేసి, పరీక్షా కేంద్రం లోకేషన్‌కై POLYCET Exam సెంటర్ లొకేటర్ టాబ్‌ను తెరవండి. ఆ తర్వాత హాల్ టికెట్ నంబర్‌ను ఎంటర్ చేసి, సెర్చ్ బటన్‌పై క్లిక్ చేయండి. అంతే పరీక్షా కేంద్రం కోడ్, విద్యార్థి పేరు, సెంటర్ చిరునామా కనపడతాయి. గూగుల్ మ్యాప్స్ ద్వారా విద్యార్థి స్థానం నుండి పరీక్షా కేంద్రం దూరాన్ని తక్షణమే యాక్సెస్ చేయవచ్చు. ఇది సరైన సమయానికి చేరుకోవడానికి సరైన మార్గాన్ని నావిగేట్ చేయడంలో కూడా సహాయపడుతుంది.

# సీఎం బూతులు తిడితే పదవి వస్తుందనుకోవడం నీ అవివేకం

* ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్:**

ఈటెల రాజేందర్, మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. ఈటెల మర్యాదస్తుడు అనుకున్నాం.. కానీ, ఆయనకు మతి తప్పిందని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలంటే మీ అధిష్టానాన్ని కాక పట్టుకో.. కానీ మా ముఖ్యమంత్రిని బూతులు తిడితే పదవి వస్తుందనుకోవడం నీ అవివేకానికి నిదర్శమని ఆయన అన్నారు. ఇంత కాలం రాజకీయాల్లో ఉండి చివరకు ఈ స్థితికి వస్తావని మేం అనుకోలేదని, ఈటెల రాజేందర్ ముందు నీ పిచ్చి వాగుడు కట్టి పెట్టి.. ఈ పిచ్చి ప్రేలాపనలు ఆపు అని అన్నారు. శాడిస్ట్, సైకో అని మాట్లాడావు.. మాకు అంతకు మించిన మాటలు కూడా వచ్చు.. అది గుర్తు పెట్టుకో అని అన్నారు. 30 ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉండి నా కొడకా అన్న పదాలు వాడుతున్నవంటే నీ మానసిక స్థితి అర్థమవుతూనే ఉందని, నీ నీచ రాజకీయం కోసం మా ముఖ్యమంత్రి పైన దిగజారుడు భాష ఉపయోగిస్తే మాత్రం సహించమని ఆయన అన్నారు. మీరు నీచ భాష ఆపకపోతే మేం అంతకు మించిన భాషను వాడాల్సి వస్తోందని ఆయన అన్నారు.

# కుల గణన మీద అనుమానాలు ఉంటే నివృత్తి చేస్తాం

* రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

**హైదరాబాద్:**

బీసీల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణనపై ఎవరైనా సందేహాలుంటే, తాము వాటిని స్వయంగా ప్రధాని సమక్షంలోనైనా నివృత్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో పారదర్శకంగా, లక్ష మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా కులగణన నిర్వహించామని, ప్రత్యేక కమిషన్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగిందని తెలిపారు. “మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్ లాంటి రాష్ట్రాల్లో బీసీ గణనకు పొలిటికల్ సెట్బ్యాక్‌లు ఎదురైతే, తెలంగాణలో మాత్రం చైతన్యంతో పాటు చట్ట రూపం కూడా తీసుకొచ్చాం,” అని మంత్రి పేర్కొన్నారు. బీజేపీపై తీవ్ర విమర్శలు చేస్తూ, “కుల గణనకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు అఫిడవిట్ వేసిన చరిత్ర బీజేపీదే,” అన్నారు. మహారాష్ట్రలో బీసీ గణన చేపట్టడంతో అక్కడి ప్రభుత్వాన్ని బీజేపీ కూల్చిందని, అలాగే బీహార్, జార్ఖండ్‌లోనూ కులగణన చేపట్టిన ప్రభుత్వాలను రాజకీయంగా భూస్థాపితం చేశారని ఆరోపించారు. బీజేపీ నేత లక్ష్మణ్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన మంత్రి, బీసీలను ముఖ్యమైన పదవుల నుంచి తివాచీకి నెట్టిన బీజేపీకి ఇప్పుడు బీసీ సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం తీసుకురావడం దేశానికి రోల్ మోడల్‌గా మారిందని తెలిపారు. తెలంగాణలో చేసిన కుల గణనను కేంద్రం కూడా పాటించాల్సి వస్తోంది. రాష్ట్ర బీజేపీ నేతలు ఈ చట్టాన్ని ఆమోదించి బీసీలకు న్యాయం చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం అని మంత్రి స్పష్టం చేశారు.

# ఈఏపీసెట్ ఫలితాలు విడుదల

* ఏప్రిల్ 29 నుంచి మే 4 వరకు ఈఏపీసెట్ పరీక్షలు జరిగాయి

**హైదరాబాద్:**

తెలంగాణ ఈఏపీసెట్ పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు గుడ్ న్యూస్. ఈఏపీసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఆదివారం ఉదయం 11 గంటల 15 నిమిషాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈఏపీసెట్ రిజల్ట్స్ ను రిలీజ్ చేశారు. తెలంగాణ ఈఏపీసెట్ ఫలితాల్లో ఏపీ విద్యార్థులు సత్తాచాటారు. ఏపీకి చెందిన పల్ల భరత్ చంద్ర ఇంజినీరింగ్ స్ట్రీమ్ లో మొదటి ర్యాక్ కైవసం చేసుకున్నాడు. తెలంగాణకు చెందిన ఊదగండ్ల రామ చరణ్ రెడ్డి రెండో ర్యాంక్ తో మెరిశాడు. అగ్రికల్చర్‌ఫార్మసీ విభాగంలో తెలంగాణకు చెందిన సాకేత్ రెడ్డి పెద్దకగరి ఫస్ట్ ర్యాంక్ తో సత్తాచాటాడు. ఫలితాల కోసం ఈ లింక్ పై క్లిక్ చేయండి https://eapcet.tgche.ac.in/ విద్యార్థుల రిజిస్టర్డ్ మొబైల్‌కే నేరుగా ఫలితాలు అందించారు. ఇంజినీరింగ్‌లో 2 లక్షల 20 వేల 326 మంది దరఖాస్తు కోగా 2 లక్షల 7 వేల 190 మంది విద్యార్థులు హాజరయ్యారు. క్వాలిఫై అయిన వారు లక్షా 51 వేల 779 మంది. అర్హత సాధించినవారు 73.26 శాతం. బైపీసీలో 86 వేల 762 మంది దరఖాస్తు కోగా 81 వేల 198 మంది విద్యార్థులు హాజరయ్యారు. 71 వేల 309 మంది విద్యార్థులు అర్హత సాధించారు. అర్హత సాధించిన విద్యార్థులు 87.82 శాతం. గతం కంటే ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో 1.72 శాతం తగ్గిన అర్హత శాతం. అగ్రికల్చర్, ఫార్మ స్ట్రీమ్‌లో సుమారు 2 శాతం అర్హత శాతం తగ్గింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 29 నుంచి మే 4 వరకు ఈఏపీసెట్ పరీక్షలు జరిగాయి. ఏప్రిల్ 29, 30వ తేదీల్లో అగ్రికల్చర్‌ఫార్మసీ విభాగం పరీక్షలు జరగగా.. మే 2, 3, 4 తేదీలో ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరిగాయి. ఇంజనీరింగ్‌కు 2,20,327 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 2,07,190 మంది పరీక్షకు హాజరయ్యారు. అగ్రికల్చర్ విభాగంలో 86,762 మంది దరఖాస్తు చేసుకోగా.. 81,198 మంది హాజరయ్యారు. ఈ ఏడాది కూడా జేఎన్టీయూ హైదరాబాద్ ఆధ్వర్యంలోనే ఈఏపీసెట్ పరీక్షలు జరిగాయి. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో అడ్మిషన్లకు ఈఏపీసెట్ ఎంట్రన్స్ ర్యాంకుల ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహిస్తారు.

# ట్రంప్ జోక్యంతో కాల్పుల విరమణ

* భారత సైనికులకు నివాళులర్పించిన ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్ :**

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై కౌంటర్ దాడులకు దిగింది. అనంతరం పాకిస్తాన్ ప్రత్యక్షంగా భారత్‌పై దాడికి దిగడంతో, ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ ఉద్రిక్త వాతావరణాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం వల్ల కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా సాంత్వనకు తీసుకువచ్చారు. ప్రస్తుతం రెండు దేశాల సరిహద్దుల్లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది.

## ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు
# ఏర్పాటు చేయండి

* భారత్- పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం
* ప్రధానికి లేఖ రాసిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ..

**ఢిల్లీ:**

రత్ పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో శనివారం నాడు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారు. ఆపరేషన్ సిందూర్ పై ప్రత్యేక పార్లమెంటు సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇక, పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ తో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కాల్పుల విరమణ గురించి ప్రజలకు తెలియజేయడం చాలా కీలకం అన్నారు. అయితే, మన ముందున్న సవాళ్లను ఎదుర్కోవడానికి సమిష్టి కృషి అవసరం అని రాహుల్ గాంధీ ఆ లేఖలో పేర్కొన్నారు. మరోవైపు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రవాద దాడిపై చర్చించడానికి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కోరారు. భారత్ పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణపై కూడా ఈ సమావేశాల్లోనే చర్చించాలని తెలిపారు. ప్రత్యేక సమావేశాలకు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకుంటుందని నేను నమ్ముతున్నాను అని ఖర్గే చెప్పుకొచ్చారు.

# నేడు వీర జవాన్ మురళీ నాయక్ అంత్యక్రియలు

* కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు

**ఆంధ్రప్రదేశ్:**

నాలుగు రోజులుగా క్షణ క్షణం టెన్షన్ వాతావరణం నెలకొంది. భారత్ పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనలు నెలకొన్నాయి. పాక్‌పై భారత సైన్యం విరుచుకుపడింది. పాక్‌ను కోలుకోలేని దెబ్బకొట్టింది. భారత్ పాక్ వార్‌లో తెలుగు జవాన్ మురళీ నాయక్‌తో పాటు మరో ఇద్దరు వీరమరణం పొందారు. ఏపీలోని సత్యసాయి జిల్లా కల్లితండాకు చెందిన మురళీ నాయక్ జమ్ము కశ్మీరులోని ఎల్‌వోసీ వద్ద పాకిస్తాన్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో ప్రాణాలు విడిచాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ భౌతికకాయం నిన్న సొంతూరికి చేరింది.

మురళీ భౌతికకాయాన్ని శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని గడ్డంతాండ పంచాయతీ కల్లితాండాకు ఆర్మీ అధికారులు తీసుకొచ్చారు. కుమారుడి మృతదేహం చూసి మురళీ తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. మురళీ భౌతికకాయంను చూసేందుకు స్థానికులు భారీగా తరలి వచ్చారు. చేతిలో మువ్వన్నెల జెండా పట్టుకుని ‘భారత మాతకు జై’, ‘జై జవాన్’, ‘మురళీ నాయక్ అమర్ రహే’ అంటూ నినాదాలు చేశారు. కాగా నేడు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో వీర జవాన్ మురళీ నాయక్ అంత్యక్రియలు నిర్వహించనుంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. మురళి నాయక్ అంత్యక్రియలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.

# పాకిస్తాన్‌పై బ్రహ్మోస్‌తో భారత్ దాడి

**మొదటి పేజీ తరువాయి**

ఉపయోగించినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా, పాకిస్తాన్ పంజాబ్‌లోని బహవల్పూర్ జైషేమహ్మద్ ఉగ్ర కార్యాలయంపై దీనిని ప్రయోగించి ఉండొచ్చని తెలుస్తోంది. బహవల్పూర్ అంతర్జాతీయ సరిహద్దు నుంచి 100 కి.మీ దూరంలో ఉంది. దీనిపై అత్యంత ఖచ్చితత్వంతో దాడి జరిగింది. భారత్, పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని మోహరించడంపై ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ కవ్వింతల తర్వాత భారత్ పాకిస్తాన్‌లోని రఫీకి (షోర్కోట్), మురిద్ (చక్వాల్), నూర్ ఖాన్ (రావల్పిండి), రహీం యార్ ఖాన్, సుక్కూర్, చునియన్ (కసూర్) వైమానిక స్థావరాలతో సహా విస్తృత శ్రేణి వ్యూహాత్మక పాకిస్తాన్ సైనిక ఆస్తులను లక్ష్యంగా చేసుకుంది. పస్రూర్, సియాల్ కోట్‌లోని రాడార్ లను కూడా నావనం చేసింది. దీంతో పాకిస్తాన్ ఎయిర్ ఫోర్స్ దారుణంగా దెబ్బతింది. ఇదిలా ఉంటే, ఈ దాడుల్లో కూడా బ్రహ్మోస్ ఉపయోగించి ఉండొచ్చనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

# నీటి హక్కులు ఆంధ్రాకు తాకట్టు

**మొదటి పేజీ తరువాయి**

నీటి దోపిడికి కాంగ్రెస్ నేతలు నోరు మెదపలేదని, కానీ ఇప్పుడు తెలంగాణ హక్కులను ఆంధ్రాకు తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ 90% పనులను పూర్తి చేసిన సీతారామ ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ కోర్టు కేసులతో అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. “ఉత్తమ్ కుమార్ రెడ్డికి కనీస అవగాహన లేకుండా అనుమతుల్లేవంటూ మాట్లాడడం దుర్మార్గం,” అని హరీష్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సాగునీటి రంగంలో బీఆర్ఎస్ విజయాలను తాము సాధించినవిగా చూపించుకోవడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. “తెలంగాణకు సాగునీటి విషయంలో 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన అన్యాయం చేస్తే, బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ళ పాలనలో విజయ బావుటా ఎగురవేసింది,” అని హరీష్ రావు స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నీటి వినియోగంలో సమర్థతను సాధించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

# ఉగ్రవాదం ఆమోదయోగ్యం కాదని పాకిస్తాన్ అర్థం చేసుకోవాలి

* లేకుంటే ఎన్ని చర్చలు జరిపినా ఆశించిన ఫలితం రాదు
* భారత మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్

**ఢిల్లీ:**

ఉగ్రవాదం ఆమోదయోగ్యం కాదని పాకిస్తాన్ అర్థం చేసుకోవాలి, లేకుంటే ఎన్ని చర్చలు జరిపినా ఆశించిన ఫలితం రాదని స్పష్టం చేశారు భారత మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్.. ఇప్పుడు భారత్ జాగ్రత్తగా ఉండాలన్నారు.. ఆపరేషన్ సిందూర్‌లో భాగస్వాములైనమా అధికారులకు సెల్యూట్ చేయండి, వారిని చూస్తే గర్వంగా ఉంది.. సాయుధ దళాలు అద్భుతమైన నిర్ణయాలతో విజయం సాధించాయి అంటూ ఆపరేషన్ సిందూర్‌పై ప్రశంసలు కురిపించారు.. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో, ఖుర్షీద్ మాట్లాడుతూ.. మనం ఏమి చేసినా, మనం ఏమి చేరుకోవడానికి ప్రయత్నించినా.. చివరికి దానికి ఒక సారాంశం ఉంది.. అదే ఉగ్రవాదాన్ని లేకుండా చేయడమే అన్నారు ఖుర్షీద్.. ఇంకా ఏవైనా ఉగ్రవాద దాడులు జరిగితే యుద్ధ చర్యగా పరిగణిస్తామని.. తదనుగుణంగా వ్యవహరిస్తామని భారత్ ప్రకటించింది.. కానీ, యుద్ధ చర్యకు ప్రతిస్పందించడానికి కూడా పరిమితులు ఉన్నాయని వ్యాఖ్యానించారు..

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఆమోదయోగ్యం కాదని పాకిస్తాన్ స్పష్టమైన ప్రకటనతో అంగీకరించాలని డిమాండ్ చేశారు సల్మాన్ ఖుర్షీద్.. అది చేయకపోతే, పెద్దగా సాధించడానికి అవకాశం ఉందని నేను అనుకోను అన్నారు.. పాకిస్తాన్ కేంద్రంగా ఉన్న ఉగ్రవాద నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేసే సామర్థ్యాన్ని భారతదేశం ప్రపంచానికి తెలియజేసిందా? అని వేసిన ప్రశ్నకు సమాధానంగా.. ఇది చాలా సున్నితమైన అంశం.. ఉగ్రవాద నెట్‌వర్క్ కూల్చివేయబడిందని.. త్వరలో అది కనిపించదని భారతదేశం ఆలోచించగలదా అని ప్రశ్నించారు?.. అది చాలా ఆశాజనకంగా ఉంటుందని నేను భావిస్తున్నాను అన్నారు.. ఆపరేషన్ సిందూర్ లో ఉగ్రవాద స్థావరాలపై దాడుల సమయంలో లక్ష్యంగా చేసుకున్న తొమ్మిది ప్రదేశాలలో రెండు లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయం మురిడ్కే, జైషే మొహమ్మద్ ప్రధాన స్థావరం భవల్పూర్ ఉన్నాయన్న ఆయన.. ఆపరేషన్ సిందూర్ తో భారతదేశం ప్రతీకారం తీర్చుకున్న తర్వాత పాకిస్తాన్ కాల్పుల విరమణను ప్రకటించింది.. కానీ, కొన్ని గంటల్లోనే దానిని ఉల్లంఘించిందని ఫైర్ అయ్యారు భారత మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్.

# ఆర్మీ కమాండర్లకు పూర్తి అధికారాలు

* ఆదేశాలు జారీ చేసిన ఆర్మీ చీఫ్
* కాల్పుల విరమణ ఉల్లంఘిస్తే పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలి



**ఢిల్లీ:**

పాకిస్తాన్ కాల్పుల విరమణ ఉల్లంఘించినట్లయితే, ప్రతిఘటన తీవ్రంగా ఉండాలని దీని కోసం కమాండర్లకు పూర్తి అధికారం మంజూరు చేస్తూ ఆర్మీ సంచలన ఆదేశాలు ఇచ్చింది. ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ఈ మేరకు ఆర్మీ కమాండర్లకు పూర్తి అధికారం ఇచ్చారు. పాకిస్తాన్ దుందుడుకు చర్యలకు పాల్పడితే, దాడులు తీవ్రంగా ఉండాలని పశ్చిమ ప్రాంతంలోని అన్ని ఆర్మీ కమాండర్లకు ఆర్మీ చీఫ్ పూర్తి అధికారాలు కట్టబెట్టారు. శనివారం భారత్, పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మేరకే భారత్ కాల్పుల విమరణకు అంగీకరించింది. ఈ ఒప్పందానికి కొన్ని గంటల ముందు.. పాకిస్తాన్ భవిష్యత్తులో ఏదైనా ఉగ్రవాద చర్యకు పాల్పడితే యుద్ధ చర్యగా భావిస్తామని భారత్ దేశం ప్రకటించింది. “మే 1011, 2025 రాత్రి కాల్పుల విరమణ మరియు వైమానిక ఉల్లంఘనల ఫలితంగా, ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పశ్చిమ సరిహద్దుల ఆర్మీ కమాండర్లతో భద్రతా పరిస్థితిని సమీక్షించారు’’ అని భారత సైన్యం ఎక్స్ పోస్టులో తెలిపింది. మే 10, 2025 నాటి డీజీఎంవో చర్చల ద్వారా కుదిరిన అవగాహనను ఉల్లంఘించినందుకు కైనెటిక్ ప్రతిఘటన కోసం ఆర్మీ చీఫ్ ఆర్మీ కమాండర్లకు పూర్తి అధికారాలు ఇచ్చారు’’ అని సైన్యం తెలిపింది. ‘‘కైనెటిక్ యాక్షన్’’ అంటే సైన్యం కదలికల్ని, ఆయుధాలను కాల్చే చర్యను సూచిస్తుంది. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు 26 మంది పర్యాటకుల్ని కాల్చి చంపడంతో ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. పాకిస్తార్, పీఓకేలోని ఉగ్రవాద కార్యాలయాలు,స్థావరాలపై భారత్ ‘‘ఆపరేషన్ సిందూర్’’ పేరుతో భీకర దాడులు చేసింది. పాక్ డ్రోన్లతో దాడులకు తెగబడటంతో, శనివారం తెల్లవారుజామున భారత్ పాకిస్తాన్ మిలిటరీకి చెందిన ఆర్మీ, వైమానిక స్థావరాలను టార్గెట్ చేస్తూ దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పాక్ రాడార్ కమాండ్ కంట్రోల్ కేంద్రాలు, ఎయిర్ బేసులు ధంసమయ్యాయి.



# పీఓకే, ఉగ్రవాదుల అప్పగింతపై మాత్రమే చర్చలు

**మొదటి పేజీ తరువాయి**

లష్కరేతోయిబా ఉగ్రవాద స్థావరాలపై దాడులు నిర్వహించింది. ఆ తర్వాత పాక్ డ్రోన్లతో, క్షిపణులతో భారత్‌పైకి దాడి చేసింది. దీనికి ప్రతీకారంగా శనివారం తెల్లవారుజామున భారత్ పాకిస్తాన్‌లోని కీలక ఆర్మీ, వైమానిక స్థావరాలపై భారీ దాడులు చేసింది. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో అమెరికా మధ్యవర్తిత్వంతో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే, ఈ చర్చల్లో యూఎస్ వైస్ ప్రెసిడెండ్ జేడీ వాన్స్ కీలకంగా వ్యవహరించారు. ఆయన ప్రధాని మోడీతో ఒప్పందం గురించి మాట్లాడారు. అయితే, భారత్ తన నిర్ణయాన్ని జేడీ వాన్స్‌కి స్పష్టం చేసింది. మరోసారి పాకిస్తాన్ దాడికి తెగబడితే, చాలా దారుణమైన ప్రతిదాడిని ఎదుర్కోవాల్సి వస్తుందని మోడీ జేడీ వాన్స్‌కి తెలిపారు. గత 40 ఏళ్లుగా పాకిస్తాన్ ఉగ్రవాదానికి కారణమవుతోందని చెప్పారు. పాక్ దాడి చేస్తే, మా దాడి తీవ్రంగా ఉంటుంది. కాల్పుల విరమణలో అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం గురించి చర్చ సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రధాని మోడీ, జేడీ వాన్స్‌తో మాట్లాడుతూ.. పాకిస్తాన్ ఒకవేళ భారతదేశంపై దాడి చేస్తే, తీవ్రంగా దాడి చేసి ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేసినట్లు ఆదివారం ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాశ్మీర్ విషయంలో భారత వైఖరి స్పష్టంగా ఉందని చెప్పినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ నుంచి పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)ని తిరిగి తీసుకువడం మిగిలి ఉందని చెప్పినట్లు, పాకిస్తాన్ టెర్రరిస్టుల్ని అప్పగించాలని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. భారత్‌పాక్ మధ్య ఎవరూ మధ్యవర్తిత్వం వహించాలని భారత్ కోరుకోవడం లేదని మోడీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, మనం కొత్త సాధారణ స్థితిలో ఉన్నామని ఆయన చెప్పారు. ప్రపంచం, పాకిస్తాన్ దీనిని అంగీకరించాలని చెప్పినట్లు సమాచారం.

# హెల్త్ కేర్ హబ్ గా జగిత్యాల

- డయాలసిస్ సెంటర్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- జగిత్యాల ఆసుపత్రికి ఎమ్మారై స్కాన్ మంజూరు
- డాక్టర్లు సకాలంలో వైద్య సేవలు అందించాలి...
- విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు ..
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వండి..
- నూరు శాతం డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేయించాలి..
- ప్రజలు ప్రభుత్వాసుపత్రులను విని యోగించుకోవాలి
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ




**శెనార్తి మీడియా, జగిత్యాల**

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ..జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ బలోపేతంపై సమగ్రంగా సమీక్ష..తెలంగాణ రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లాను అత్యుత్తమ హెల్త్ కేర్ హబ్ గా తీర్చి దిద్దటానికి అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్. రాజా నరసింహ పేర్కొన్నారు.ఆదివారం జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో మెడికల్, హెల్త్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ డీఎంఈ పరిధిలో ఉన్న ఆస్పత్రుల బలోపేతం పై ఆయా విభాగాల అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన అన్ని వివరాలను మంత్రి దామోదర్ రాజనర్సింహ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యశాఖ అధికారుల నుంచి ఆసుపత్రులు పనితీరు వైద్యుల సేవలు.. ప్రజల స్పందన.. ఇబ్బందులు.. దవాఖానాల్లో నెలకొన్న సమస్యలను మంత్రి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లా లో అవసరమైన వైద్య పరికరాలు అందజేస్తామన్నారు. జగిత్యాల జనరల్ హాస్పిటల్ కు ఎమ్మారై స్కాన్ ను. మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లాలో గల మూడు డయాలసిస్ సెంటర్లలో రోగులకు అత్యుత్తమైన సేవలు అందించా లని, వారి పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. ఉత్తర తెలంగాణ కు కీలక జిల్లా అయిన జగిత్యాల జిల్లాను వైద్య పరంగా మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. వైద్యులు బాధ్యతయుతంగా పని. చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నూటికి నూరు. శాతం డెలివరీ లను ప్రోత్సాహించాలని ఆదేశాంచారు . ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెరిగేలా వైద్యాధికారులు సిబ్బంది ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. ఇందుకు గ్రామ గ్రామాన అంగన్వాడి కార్యకర్తలు ఆశా వర్కర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్ ప్రమాద బాధితులకు జగిత్యాల ధర్మపురి పరిధిలో ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు. చేస్తామనీ వెల్లడించారు. జిల్లాలో సెంట్రల్ డ్రగ్ సెంటర్ ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. డ్రగ్ సెంటర్ నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. జగిత్యాల డయాలసిస్ సెంటర్లో రోగులకు మరింత అత్యుత్తమైన సేవలు అందేలా పకడ్బందీగా వైద్యులు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో వైద్యులు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, వారి పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ అత్యుత్తమైన సేవలందించాలని సూచించారు. సకాలంలో వైద్య సేవలు అందించని వైద్య అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అయితే అధికారులు, సిబ్బంది పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అం దించి ప్రభుత్వ ఆసుపత్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని, ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునికమైన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రజలంతా వాటిని సద్వినిగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వాసుపత్రులను మరింత ప్రజల ఆదరించాలని తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమీక్షలో ప్రభు త్వ విప్ లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ బిఎస్ లత డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ప్రమోద్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఖాద్రి, జి జి హెచ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సుమన్, జిల్లా కు చెందిన వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిధులు విడుదల చేయండి

- ఆరోగ్య శాఖ మంత్రిని కోరిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**శెనార్తి మీడియా, జగిత్యాల**

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పలు అభివృద్ధి పనులుగాను జగిత్యాల జిల్లా పర్యాటలో బాగంగా జిల్లా కు విచ్చేయగా జగిత్యాల జిల్లా కు అవసరమైన డ్రగ్స్ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, జగిత్యాల ప్రధాన ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ రిపేర్ చేయాలనీ కోరారు. జగిత్యాల నూకపల్లి డబల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులకు వైద్య ఆరోగ్య సేవలు నిమిత్తం 2 ప్రైమరీ హెల్త్ సెంటర్ లు మంజూరు చేసి, అవసరమైన సిబ్బంది నియామకం చేయాలని విన్నవించారు. మెడికల్ కళాశాల విద్యార్థులకు 3 బస్ లు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. వారితో స్థానిక ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ కూడా ఉన్నారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామంలో ఆదివారం విషాదఛాయలు అలుముకున్నాయి. అనారోగ్యంతో బాధపడుతున్న రౌతు లక్ష్మీనారాయణ (37) ఆదివారం మృతి చెందాడు. అతనికి భార్య మమత, ఇద్దరు కూతుళ్లు ప్రవస్తి, ప్రసస్తి ఉన్నారు.లక్ష్మీనారాయణ మృతితో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కుమారులు లేని నేపథ్యంలో పెద్ద కూతురు ప్రవస్తి తండ్రికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది. ఈ హృదయ విదారక ఘటన స్థానికులను కంటతడిపెట్టించింది.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

శెనార్తి మీడియా, శంకరపట్నం: కేశవపట్నం గ్రామానికి చెందిన అక్కపల్లి లింబాద్రి (47) ఆదివారం ప్రమాదానికి గురయ్యాడు. అంబేద్కర్ చౌరస్తా నుండి కేశవపట్నం వెళ్లే దారిలో బైక్‌పై వెళ్తుండగా, గుర్తుతెలియని టూ వీలర్ అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లింబాద్రి రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. పైలట్ గూడూరి సతీష్ రెడ్డి, ఎమర్జెన్సీ టెక్నీషియన్ కాజా ఖలీల్ ఉల్లా సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## సింగరేణి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం




**శెనార్తి మీడియా, భూపాలపల్లి**

భూపాలపల్లి లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను సింగరేణి సీఎండీ బలరాం నాయక్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. ఈ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సింగరేణి సీఎండీ బలరాం నాయక్ మాట్లాడుతూ, ఈ సెంటర్‌లో శిక్షణ పొంది యువత స్వయం ఉపాధి మార్గంలో ముందుకు సాగాలని అన్నారు. సంస్థ కార్యాచరణలో భాగంగా భూపాలపల్లి ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తరింపజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్.వి. సూర్య నారాయణ (ఆపరేషన్), కె. వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్), భూపాలపల్లి జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కే. రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘం జనరల్ సెక్రటరీ పి. రాజేందర్, అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ పెద్ది నరసింహులు, జీఎం ( హెచ్ ఆర్ డి ) జి. రఘుపతి, ఏజిఎం (ఐఈడీ) జ్యోతి పాల్గొన్నారు.

## వసుధ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



ఆపదలో ఉన్నవారిని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిది అని వసుధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మేనేజింగ్ పార్టనర్ కందునూరి ప్రశాంత్ అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ఆసుపత్రి ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి పైగా యువతీయువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం ఎంతటి కీలకమో తెలియజేశారు. యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ రక్తదాన శిబిరం మంచిర్యాల వలంటరీ బ్లడ్ సెంటర్ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమం ద్వారా యువతలో సేవా స్ఫూర్తిని పెంపొందించగలిగామని పేర్కొన్నారు. అనంతరం, కాలేజీ రోడ్డులోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వసుధ ఆసుపత్రి సిబ్బంది, యువతీ యువకులు పాల్గొన్నారు.

## ప్రణాళికబద్ధంగా వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి





**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

**సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ చౌదరి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వేసవి శిక్షణ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ చౌదరి సూచించారు. మంగళవారం ప్రారంభమైన శిక్షణ సన్నాహక సమావేశంలో ఎస్‌జీటీలు, డీఆర్పీలు, గణితం, ఆంగ్లం, సాంఘిక శాస్త్రాల స్కూల్ అసిస్టెంట్ డీఆర్పీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు శిక్షణను సమర్థవంతంగా అమలు చేయాలని, రిసోర్స్ పర్సన్లు తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని తెలిపారు. ఈ శిక్షణలో 1811 మంది స్కూల్ అసిస్టెంట్లు, 1130 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు పాల్గొననున్నారని వెల్లడించారు. శిక్షణకు అవసరమైన వసతులు కల్పించనున్నామని, కోర్సు కోఆర్డినేటర్లు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, గజిటెడ్ హెడ్‌మాస్టర్లు రాథోడ్ రమేష్, వామనుమూర్తి, జి. రామన్న, కెవి. సత్యనారాయణ పాల్గొన్నారు.

## స్నేహితురాలి వివాహానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువతి...

- సంతోష్ అనే యువకుడికి తీవ్ర గాయాలు..
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ సదన్ కుమార్..



**శెనార్తి మీడియా, చిగురుమామిడి**

స్నేహితురాలి వివాహానికి వచ్చిన ఓ యువతి కారు ఢీకొన్న ఘటనలో నిండు ప్రాణాన్ని కోల్పోయిన సంఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో ఆదివారం తీవ్ర విషాదాన్ని నింపింది.వివరాల్లోకి వెళితే జగిత్యాల జిల్లా జాబుదాపూర్ కు చెందిన మౌనిక(23) అనే యువతి సుందరగిరిలో జరిగిన తన స్నేహితురాలి వివాహానికి స్నేహితులతో కలిసి వచ్చారు.మౌనిక తన స్నేహితుడు సంతోష్ తో కలిసి సాయంత్రం నాలుగు గంటల సమయంలో సుందరగిరిలోని ఫంక్షన్ హాల్ ముందు రోడ్డు పక్కన బస్ కోసం చూస్తుండగా హుస్నాబాద్ లోని ఓ వివాహానికి హాజరై తిరిగి కారులో కరీంనగర్ కు తన కుటుంబ సభ్యులతో వెళ్తున్న తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంకు చెందిన శ్రీధర్ అనే వ్యక్తి అతివేగంగా వచ్చి వారిద్దరిని ఢీ కొట్టారు.ఈ సంఘటనలో మౌనిక తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా,సంతోష్ అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న తిమ్మాపూర్ సిఐ సదన్ కుమార్, చిగురుమామిడి ఎస్సై సందబోయిన శ్రీనివాస్ యాదవ్, ట్రైని ఎస్సై జగదీశ్వర్ అక్కడికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును అక్కడ ఉన్నవారిని అడిగి తెలుసుకున్నారు.ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజునుజ్జయింది.పూర్తి నిర్లక్ష్యంగా కారును అతివేగంతో నడిపిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## నాంపల్లి గుట్టపై వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం



**శెనార్తి మీడియా, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి గుట్ట శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల సౌకర్యార్థం గుట్టపై ప్రసాదాల స్టాల్ సమీపంలో వేడుకలను నిర్వహించారు.రాజన్న ఆలయ అర్చకుల పర్యవేక్షణలో అర్చకులు విజయసింహ చారి, రామకృష్ణ చారి, హర్షవర్ధన్ చారి వేద మంత్రోచారణతో కళ్యాణతంతు చేపట్టారు. కన్యాదాతలుగా రాచకొండ రామచార్యులు, సంధ్యారాణి వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో వినోద్ రెడ్డి, ఏఈవోలు శ్రీనివాస్, అశోక్, ఈఈ రాజేష్, డిఈ మహిపాల్ రెడ్డి, సుపరిండెంట్ వెంకటరాజు, పూజిత, నాంపల్లి గుట్ట ఆలయ ఇన్ చార్జ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.సుమారు 1500 పైగా భక్తులు పాల్గొనగా, కళ్యాణ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అర్చకులు గిరి స్వామి స్పందించారు.


## అధైర్యపడోద్దు ప్రజల రక్షణ కోసమే పోలీసులు

- పలు గ్రామాల్లో పోలీసుల కవాతు...





**శెనార్తి మీడియా, చిగురుమామిడి:**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంతోపాటు సుందరగిరి తదితర గ్రామాలలో ఆదివారం తిమ్మాపూర్ సిఐ సదన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు.అనంతరం అనుమానిత వ్యక్తుల కదలికలపై ఆరా తీసి,ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సిఐ సదన్ కుమార్ మాట్లాడుతూ భారత్- పాకిస్థాన్ సరిహద్దులో జరుగుతున్న ఉద్రిక్తత దృష్ట్యా ప్రజలలో అభద్రతా భావం తొలగించి,విశ్వాసం నింపడానికి పోలీసుల కవాతు నిర్వహించడం జరిగిందని,తమ గ్రామాలలో ఎవరైనా అనుమానితులు, అపరిచితులుకనబడినట్లు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కుల మతాలకతీతంగా దేశ భద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజలంతా ఏకతాటిపై నిలవాలని అన్నారు.ప్రజలు ఎవరు అధర్య పడవద్దని,ప్రజల రక్షణ కొరకే పోలీసులు ఉన్నారని గుర్తు చేశారు.ప్రజలు అప్రమత్తమై తీసుకోవలసిన పలు జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలను తనిఖీలు చేశారు.గ్రామాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రీనివాస్ యాదవ్,ఎల్ఎండి ఎస్ఐ వివేక్,గన్నేరువరం ఎస్ఐ నరేందర్, ట్రైని ఎస్సైలు జగదీశ్వర్, అరుణ్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా రసమయి కుమారుడి వివాహం

మనకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కుమారుడి వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలకు ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వధూవరులను ఆశీర్వ దించిన వారిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఈటెల రాజేందర్, సాంస్కృతిక సారథి ఛైర్మన్ వెన్నెల, జగదీష్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, కొప్పల ఈశ్వర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రఘునందన్ రావు తదితరులు ఉన్నారు.




## శ్రీలంకలో ఘోర బస్సు ప్రమాదం


- కొండపై నుంచి పడిపోయిన బస్సు
- 21 మంది మరణం
- పలువురికి గాయాలు

**శ్రీలంక:**

శ్రీలంకలో ఘోర ప్రమాదం జరిగింది. ఆదివారం శ్రీలంకలోని తేయాకు పండించే కొండ ప్రాంతంలో ఒక ప్రయాణికుల బస్సు కొండపై నుంచి జారిపడి 21 మంది మృతిచెందారు. ఈ ప్రమాదంలో మరో 36 మంది గాయపడ్డారని అక్కడి అధికారులు తెలియజేశారు. ఈ ప్రమాదం దేశ రాజధాని కొలంబోకు తూర్పున 140 కి.మీ దూరంలో ఉన్న కోట్మలే పట్టణానికి సమీపంలో, ఈ రోజు తెల్లవారుజామున జరిగింది. రహదారులు, రవాణా డిప్యూటీ మినిస్టర్ ప్రసన్న గుణసేన మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాదంలో 21 మంది మరణించినట్లు ధ్రువీకరించారు. మొత్తం 77 బౌద్ధ యాత్రికులు బస్సులో ఉన్నట్లు తెలుస్తోంది. బస్సు కెపాసిటీ కన్నా 25 మంది అదనంగా తీసుకెళ్లడంతోనే ఘటన జరిగినట్లు అనుమానిస్తున్నారు. డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం జరిగిందని స్థానిక పోలీసులు వెల్లడించారు. ప్రమాదానికి గురైన బస్సు శ్రీలంక ప్రభుత్వ రవాణా సంస్థకు చెందినదిగా గుర్తించారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

**శెనార్తి మీడియా, గన్నేరువరం:** మండలలోని పారువెల్ల గ్రామానికి చెందిన ఏలేటి ముత్యం రెడ్డి (63) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో పురుగుల మందు మూడు రోజుల క్రితం ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి చనిపోయాడు. మృతురాలి భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు ఎస్ఐ అరుణ్ కుమార్ కేసు నమోదు చేశారు. పంచనామా అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.



## వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ నాయకులు

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

మనకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కుమారుడి వివాహం ఆదివారం జరుగగా గన్నేరువరం మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలకు హాజరైన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపవెంకన్న, హనుమాండ్ల మల్లేశం , గూడెల్లి ఆంజనేయులు, న్యాలపట్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు

## సౌదీలో చికిత్స పొందుతున్న బాధితుడికి ఫోన్లో కేటీఆర్ పరామర్శ

**శెనార్తి మీడియా, సిరిసిల్ల :**



'మహేష్ నాలుగు రోజులు ధైర్యంగా ఉండు... మనోళ్లు సౌదిలో ఉన్నరు.. నీదగ్గరు వస్తరు.. నాలుగు రోజుల్లోనే మండెపల్లికి తీసుకువస్తా' అని సౌదిలో రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో అచేతనలో ఉన్న మహేష్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని మహేష్ కుటుంబసభ్యులను ఆదివారం కలిసి, ధైర్యంగా ఉండాలని సూచించారు. వారి సమక్షంలో సౌదిలో దవాఖానాలో ఉన్న మహేష్ విడియో కాల్ మాట్లాడారు.మహేష్ నాలుగు రోజులు ధైర్యంగా ఉండాలని సూచించారు. దవాఖానా వివరాలు పంపించాలని కోరారు. సౌదిలో మన టీం సభ్యులు వస్తారని, నిన్ను మండెపల్లికి తీసుకువస్తారని ధైర్యంగా చెప్పారు. ఆధైర్యపడవద్దని, తాను ఉన్నానని అన్ని చూసుకుంటానని పేర్కొ న్నారు. సౌదిలో దవాఖానాలో డిశ్చార్జి చేయించి, సొంత ఖర్చులతో అక్కడి నుంచి హైదరాబాద్ ఎయిర్పోర్టుకు రాగానే, ఎయిర్పోర్ట్ నుంచి మండెపల్లి వరకు తీసుకువచ్చేలా చూస్తానని మహేషుకు వివరించా రు. ఆయన వెంట డాక్టర్ నక్క రవి, రాగి పెల్లి కిష్టారెడ్డి, బండి భాస్కర్, పెద్ది వెంక టేష్, నేవూరి రాం, ప్రశాంత్, పర్శరాములు, నేవూరి నవీన్రెడ్డి, తదితర నేతలు ఉన్నారు.

## నేటి నుంచి కాల్పుల విరమణ ప్రారంభం కావాలి

### రష్యా యుద్ధ ముగింపు చర్చల్ని స్వాగతించిన జెలెన్ స్కీ

**ఉక్రెయిన్:** ఉక్రెయిన్ రష్యా యుద్ధంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటు న్నాయి. యుద్ధం ముగింపుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా ప్రకటించిన నేపథ్యంలో, చర్చలకు తాము కూడా సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్ కూడా ప్రకటించింది. రష్యా యుద్ధ ముగింపు చర్చల్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ స్వాగతించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రష్యా యుద్ధం ముగించడం గురించి ఆలోచించడం ప్రారంభించిందని, కానీ రష్యా వైపు నుంచి మే 12 నుంచి కాల్పుల విరమణ పాటించడమే మొదటి అడుగు అని ఆయన అన్నారు. "రష్యన్లు చివరకు యుద్ధాన్ని ముగించడం గురించి ఆలోచించడం ప్రారంభించారనేది సానుకూల సంకేతం ... మరియు ఏదైనా యుద్ధాన్ని నిజంగా ముగించడంలో మొదటి అడుగు కాల్పుల విరమణ," అని జెలెన్ స్కీ ఎక్స్లో రాసుకొచ్చారు. ఒక్క రోజు కూడా హత్యల్ని కొనసాగించడంలో అర్థం లేదని, రేపు మే 12 నుంచి రష్యా పూర్తి, శాశ్వత, నమ్మదగిన కాల్పుల విరమణను నిర్ధారించాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

## బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

**శెనార్తి మీడియా, గన్నేరువరం :**

మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సముద్రాల జానీ పక్షవాతానికి గురయ్యాడు. బాధితుడు ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

## దోపిడీ రహిత సమాజం కోసం సీపీఐ పోరాటం

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**



భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లుగా ప్రజల పక్షాన నిలిచింది. దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం నిరంతరం పోరాడుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలిపారు. ఆదివారం గన్నేరువరం మండల కేంద్రంలోని ముదిరాజుల భవన్లో సీపీఐ మండల 3వ మహాసభ నిర్వహించబడింది. సభకు చొక్కాల శ్రీశైలం అధ్యక్షత వహించగా, జెండా ఆవిష్కరణను మర్రి వెంకటస్వామి చేశారు. మహాసభలో మూడు సంవత్సరాల పార్టీ కార్యక్రమాల నివేదికను కాంతాల అంజిరెడ్డి సమర్పించారు.ప్రధాన అతిథిగా మాట్లాడిన వెంకటస్వామి, బీజేపీ ప్రభుత్వం పదకొండు ఏళ్లుగా కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకు పాలన సాగిస్తోందని ఆరోపించారు. పహల్గాం ఉగ్రదాడి కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిక్షిప్తంగా చూపుతుందని, ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సీపీఐ మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పేదలకు ఇండ్లు, స్థలాలు, రైతులకు రుణ మాఫీ, భూ సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ దేశ వ్యాప్తంగా 100 ఏళ్ల ఉత్సవాలు నిర్వహిస్తోందని, భూసంస్కరణ చట్టం, సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ వంటి పథకాలకు సీపీఐ కృషి చేస్తున్నదన్నారు. రానున్న రోజుల్లో మండలంలో పార్టీని బలోపేతం చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులు విజయం సాధించి ప్రజల కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోనగిరి మహేందర్, మూడేళ్ల కాలంగా పని చేసిన నాయకులు, ప్రతినిధులు హాజరయ్యారు. మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, గ్రామ శాఖ కార్యదర్శులు బోయిని మల్లయ్య, పిప్పల కనుకయ్య, కోతి సంపత్, చెరుకు ఆంజనేయులు, బోయిని తిరుపతి, గాజుల లక్ష్మణ్, నాగయ్య, మండల నాయకులు కూన మల్లయ్య, ఘర్షకుర్తి శ్రీనివాస్, బొమ్మకంటి ఆంజనేయులు, రాపోలు రాజమల్లు, బొమ్మకంటి సాధనందం, బుర్ర శ్రీను, మడికే సంతోష్, తాళ్లపల్లి సంపత్, సాధనందం తదితరులు పాల్గొన్నారు.

## ఫైనల్లో శ్రీలంకపై భారత్ ఘన విజయం

- సెంచరీతో చెలరేగిన స్మృతి మందాన
- ఫైనల్లో శ్రీలంకపై 97 పరుగుల తేడాతో ఘన విజయం
- భారత్ మహిళల జట్టు మరో సిరీస్ కైవసం

**శ్రీలంక:**



శ్రీలంక వేదికగా జరిగిన మహిళల మూడు జట్ల వన్డే ట్రై సిరీస్ ఫైనల్లో భారత మహిళల జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. నేడు కొలంబో (ఆర్పిఎస్) స్టేడియంలో శ్రీలంక మహిళల జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్లో భారత్ 97 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 342 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ స్మృతి మందాన మరోసారి తన తడాఖా చూపించింది. ఆమె 101 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సులతో 116 పరుగుల అద్భు త శతకం బాదింది. ఆమెకు తోడుగా హర్లీన్ డియోల్ (47), హర్మన్‌ప్రీత్ కౌర్ (41), జెమీమా రోడ్రిగ్స్ (44) పరుగుల తో నిలిచారు. చివర్లో దీప్తి శర్మ (20 నాటౌట్) ఫినిషింగ్ టచ్ ఇచ్చింది. ఇక శ్రీలంక బౌలింగ్‌లో మాల్కి మడారా, దెవ్మి విహంగా, సుగంధిక కుమారి చెరో రెండు వికెట్లు తీశారు. ఇక 343 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక మహిళలు 48.2 ఓవర్లలో కేవలం 245 పరుగులకే ఆలౌట్ అయ్యారు. కెప్టెన్ చమారి అథపత్తు 51, నీలక్షిక సిల్వా 48 పరుగులతో రాణించినా, మిగతా ఆటగాళ్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. ఇక భారత్ బౌలింగ్ లో స్నేహ రానా 9.2 ఓవర్లలో 38 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టింది. అమన్‌జోత్ కౌర్ 3 వికెట్లు తీయగా, శ్రీ చరణి ఒక వికెట్ తీసింది. దీనితో 97 పరుగుల తేడాతో భారత మహిళా జట్టు వన్డే ట్రై సిరీస్ ను కైవసం చేసుకుంది.

ఇక ప్లేయర్ అఫ్ ది మ్యాచ్ గా 'స్మృతి మందాన' ఎంపిక అవ్వగా.. ప్లేయర్ అఫ్ ది సిరీస్ గా 'స్నేహ రానా' ఎన్నికైంది. ఇక ఈ మ్యాచ్ లో స్మృతి మందాన సెంచరీ చేయడంతో వన్డేలలో అత్యధిక సెంచరీలు చేసిన మూడో మహిళగా రికార్డ్ సాధించింది.